
# చీపురుదెబ్బ చెంపపెట్టు



శ్రీ నందివాడ కామేశ్వరరావు

అవి మేము ఫోర్తుఫారం చదువుతూ వున్న రోజులు. ఆరోజుల్లో మేము చేసే అల్లరి చెప్పనలవిగాదు. మా క్లాసుకి తెలుగు పాఠం చెప్పడానికి నామాల పండితుడు ఒకాయన వస్తూవుండేవాడు. అతనికి వుల్లికూర అంటే మహాయిష్టం. యేదైనా పాఠం సంధర్భంలో భోజనంగురించి ప్రస్తావనవస్తే, 'వుల్లి అయిన వుండవలె, లేక తల్లి అయిన వుండవలె భోజనోత్తరవేళన్' అని స్వామెతలు చెపుతూవుండేవాడు. క్లాసులోనికి రాగానే ఒక కుర్రవాడిని పిలిచి, 'ఓరే, వీరన్నా! దేవీవిలాస్‌కి వెళ్ళి రెండు దోశెలు వుల్లిచట్నీ లావుగావేసి తీసుకురారా!' అని ఆర్డరుయిచ్చేవాడు. నలభై అయిదు నిమిషాల పీరీడు దోశెలు తిండంతోనే గడిచిపోయేది పాపం ఆనామాల పండితునికి. క్లాసులో పాఠాలు చెప్పడం యెట్లాగున్న పరీక్షసమయంలో మాత్రం అందులో నున్న ప్రశ్నలన్నీ చెప్పేసేవాడు. అదే అతనిలోవున్న ముఖ్యమైన సుగుణం. ఉల్లిపాయ మేష్టారి ఆకారవికారాదులుయెలాగున్న అతనికూతురు మాత్రం బంతి పువ్వులాగ వుండేది. ఆపిల్ల వయ్యారంగా గరల్సు రూంలోంచి హంసలాగ నడుస్తూ వస్తూవుంటే మా కుర్రకుంకలము క్లాసు రూం కిటికీలలోంచి తొంగి తొంగి చూచే వాళ్ళము. మా చేష్టలుచూచి ఆ వయ్యారి భామ పెదిమలు యిటుఅటూ త్రిప్పుతూ (వెక్కిరిస్తూ)తన సీట్లోకి పోయి కూర్చునేది.

ఆమె చేష్టలుచూచి మా యూనియన్ వారు సహించలేకపోయేరు. ఎలాగైనా ఆ వయ్యారిభామ భరతం పట్టాలనుకున్నారు. ఒక రోజు ఆదివారంనాడు మేమంతా డ్రిల్లుగ్రౌండులో సమావేశమై మాలోమేము చర్చించుకుంటున్నాము. యీమెను యేంచేస్తే బాగుంటుందా అన్న ప్రశ్న మాకు పెద్ద సమస్యగా పరిణమించింది. యింతలోకే మా శక్రటరీ బోద కాలు వెంకన్న (అంటే వాడికొక కాలు ఎలిఫెంటు లెగ్ లెండి, అందుచేత వాడికా టైటిలు యివ్వవలసివచ్చింది) "లేచి, ఓ! సభ్యులారా! మీరేమీ గాబరాపడకండి. నేను మంచివుపాయం ఆలోచించేను. ఆ విధంగా దానిపని పట్టేస్తాను. యిప్పుడేమి పయికి చెప్పకూడదు. కార్యం జరిగిన తరువాత మీరే చూదురుగాని" అన్నాడు. వాడిమాటకి మేమంతా ఆమోదించి సమావేశం చాలించేము.

ఆ రోజు చీకటి పడ్డతరువాత వెంకన్న మా యింటికివచ్చి, ''ఓరే! బుచ్చిబాబులు పదారా వెళ్దాము''అన్నాడు. (బుచ్చిబాబు అంటే నాముద్దుపేరు)

''ఎక్కడికిరా! యీ రాత్రి పూట?'' అన్నాను ఆశ్చర్యంగా.

''నీముఖంలాగవుంది - యిదేఛాన్సు. మళ్ళీ యిలాంటి సమయం దొరకడంచాలా కష్టం. యివ్వాళ పుల్లిపాయమేష్టరు మెయిల్లో విశాఖపట్నం వెళ్ళేడుట. అందుకే యీ అదునుకనిపెట్టి నీ దగ్గరకు వచ్చేను. పదపద'' అంటూ నారెక్క పట్టుకుని లాక్కు వెళ్లిపోయాడు.

మేమిద్దరం కలిసి గురువుగారియింటి గుమ్మందాకా వెళ్ళేము. నేనుమాత్రం వీధిగుమ్మంలో వున్న కొళాయిగట్టు దగ్గర నించున్నాను. మా వాడు గురువుగారి యింటి గుమ్మంలోనికి వెళ్ళి, ''బాబూ! మేష్టరుగారూ! తలుపు తీయండి!" అని కేకవేస్తున్నాడు. వాడి కేకలకి లోపల యేదో పని చేసుకుంటూవున్న రామచిలుక బయటకువచ్చి, 'యెవరండీమీరు?' అని ప్రశ్నించింది.

'మేమా! గురువుగారి ప్రియశిష్యులము. ఒక అత్యవసరమైన పనిమీద యిలాగ వచ్చేము. తలుపు తీయించండి' అన్నాడు మా వెంకన్న.

'ఓహో! మీరా!' అంటూ తలుపు కొంచెం ఓరగాతీసి, 'మాష్టరుగారు వూళ్ళో లేరు. మీ కేంకావాలో చెప్పండి? ఆయన వచ్చేక చెప్తాను' అన్నది సన్నని గొంతుకతో.

మా వెంకన్నకి ముచ్చెమటలు పోసేస్తున్నాయి. యేమనాలో నోరు ఆడ్డం లేదు. యెలాగో ధైర్యం తెచ్చుకుని, ''అబ్బే మరేమీలేదండీ! యీ మధ్యను మా గురువుగారు, 'ఆలింగనము, ప్రేమముద్దు' అని రెండు క్రొత్త నవలలు వ్రాసేరుట. అవికూడ మొన్ననే అచ్చుఅయి వచ్చేయని తెలిసింది. ఆ రెండూ యిప్పిస్తే చాలా సంతోషిస్తాము'' అన్నాడు మెల్లగా తడబడుతూ. ఆ పిల్ల మనసులో చిన్నచిరునవ్వు నవ్వుకొని, వీళ్ళకితగిన శాస్తి చేయాలనుకుంది కాబోలు-''సరే అయితే చూస్తా, ఒక్కనిమిషం వుండండి'' అంటూ లోనికి వెళ్ళిపోయింద.

'అయ్యో పాపం! మా బోదకాలు వెంకన్న అడిగిన ఆ రెండూ యిచ్చేస్తుంది కాబోలు అమాయకురాలు, మరినాకో!' అని తపిస్తూ కళ్ళు మిటకరిస్తూ కొళాయి గట్టుపైన కూర్చున్నాను.

యింతలోకే ఆవిడ లోపలనుండి బయటకివచ్చి, ''బాబూ! మీరు అడిగిన రెండూ మానాన్నగారు యెక్కడ పడేసారో కనబడలేదుగాని, 'చీపురుదెబ్బ, చెంపపెట్టు,'

అని రెండు క్రొత్తవివున్నాయి. అవికూడా మా నాన్నగారు మొన్న తెచ్చి వుంచేరు. కావాలంటే వెంటనే తెచ్చి యిస్తాను'' అన్నది చిరునవ్వుతో.

ఆ మాటలు వింటూ వుంటే నాకు కాళ్లు వణికి పోతున్నాయి. పలాయన మంత్రం చిత్తగిస్తే బాగుంటుందేమోనను కున్నాను. నా మాటకేంగాని, మావాడికి నిలువునా ప్రాణాలు పోయినాయంటే నమ్మండి! యేంజవాబు చెప్పడానికి నోరు ఆడకుండావుంది. యెలాగో ధైర్యం చేసు కుని, ''తల్లీ! నీదయవుంటే మేము అడిగిన రెండూ ఇయ్యి, లేకపోతే వద్దు'' అంటూ మరి వెనక్కి తిరిగి చూడకుండా చక్కా గుమ్మంమెట్లుదిగి వచ్చేడు. ''యేంరాభాయి! పండా కాయా! అన్నాను యేమీ యెరగ నట్లు. '' ఓరే! పండూలేదు కాయాలేదు. 'యింకా మనం యిక్కడవుంటే చీపురు దెబ్బలు తప్పవు అంటూ నన్ను గబగబ లాక్కుపోయేడు. ఆ వెళ్ళిపోవడం డెంకాడ గుఱ్ఱాల్లాగ వెనక్కి తిరిగిచూడకుండా బొంకులదిబ్బదాకా పరుగెత్తుకుపోయేము. అక్కడ కందకంగట్టుమీద కాస్సేపు కూర్చొని వుచ్ఛ్వాస నిశ్వాసాలు తీసు కుంటేనేగాని మా ప్రాణం తెప్పిరిల్లింది కాదు. ఆ మరునాడు మేమంతా మళ్ళా డ్రిల్లుగ్రౌండులో సమావేశమై యీ రోజు నుంచి యెవరూకూడా కిటికీలలోంచి గరల్సు రూంవైపు చూడకూడదు అని తీర్మానించు కున్నాము.

---

గాజు తయారు చేయడానికి పనికి వచ్చే ఇసుక మద్రాసు నగరానికి సమీపంలోగల ఎన్నూరులోను, తిరువాన్కూరు - కొచ్చిన్‌లోని షెర్తల్లీలోను విరివిగావున్నట్లు కనుగొనబడింది. కలకత్తాలోని సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రిసెర్చి ఇన్స్టిట్యూటువారు ఆ ఇసుకను పరిశీలించి దానితో ఆకుపచ్చనిగాజు తయారు కాగలదనీ, దానిని శుద్ధిచేస్తే తెల్లటి గాజు తయారు కాగలదని, శుద్ధిచేయడానికి ఎక్కువ మొత్తం ఖర్చు కాదని పేర్కొన్నారు.

మామిడి చెట్లకు సక్రమమైన పద్ధతులలో ఎరువు కడితే ప్రతిసంవత్సరం మంచికాపు వుంటుందని, ఒక సంవత్సరం విపరీతంగా కాసి మరుసంవత్సరం బొత్తిగా కాపులేకపోవడం సంభవించదని బీహారులోని హార్టికల్చర్ సెంటర్ వారుకనుగొన్నారు.

పంజాబులోని గుర్గాన్ ప్రాంతంలో భూగర్భంలోగల ఉప్పునీటినుంచి ఉప్పును తయారుచేయడానికి అవకాశాలు గలవని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియావారు జరిపిన పరిశీలనలనుబట్టి తెలుస్తున్నది.

(భారత ప్రభుత్వ సమాచారశాఖ)